క్లుప్తంగా

డీఎస్సీని ప్రకటించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది చదువు పూర్తి చేసుకొని ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రదానం



విజేతలైన విద్యార్థులతో ఆర్తీ పాఠశాల నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప నగరంలోని ఆర్తీ ఇంగ్లీషు మీడియం స్కూలులో నిర్వహించిన కడప నగర పాఠశాల స్థాయి పద్య పఠన పోటీలో విజేతలకు సోమవారం కడప మండల విద్యాశాఖాధికారి డి.గంగిరెడ్డి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్తీ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య పఠన పోటీలలో 173 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషదాయకమన్నారు. ఆర్తీ సంస్థల అధ్యక్షులు పుచ్చలపల్లి సంధ్య విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ ఎం.భాగ్యమ్మ మాట్లాడుతూ పోటీలను తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లోనూ, సీనియర్లు, జూనియర్ విభాగాలుగాను నిర్వహించామన్నారు. ఇందులో తొలి బహుమతి గ్రహీతకు రూ. 3000, ద్వితీయ బహుమతి గ్రహీతకు రూ. 2000, తృతీయ బహుమతి కింద రూ. 1000 నగదుతోపాటు సర్టిఫికెట్లను కూడా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని పలు పాఠశాలల్లో పాఠశాల విద్య రాష్ట్ర పరిశీలకులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని చెమ్ముమియాపేట గంగా భవానీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సోషల్ ఆడిట్ టీం ప్రతినిధులు కె. నాగేంద్ర, కె. చిన్నపెద్దయ్యలు పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు పంపిణీ, నోటుపుస్తకాలు, రిజిష్టర్లు, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, చేతివృత్తుల శిక్షణను పరిశీలించారు. విద్యార్థుల నోటుపుస్తకాలు పరిశీలించి సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. మేరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదు




కడప ఏడు రోడ్ల వద్ద మాట్లాడుతున్న కడప ట్రాఫిక్ సీఐ జావేద్

కడప అర్బన్: కడప నగరంలో ఎవరైనా సరే మైనర్లకు తల్లి దండ్రులు మోటార్ సైకిళ్లను ఇవ్వరాదని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ అన్నారు. ఆదివారం రాత్రి ఇట్స్‌మై ఇండియా ఇట్స్‌మై డ్యూటీ సేవా సంస్థ అధ్యక్షుడు మౌలాలి ఆధ్వర్యంలో కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ఎల్ఈడి స్క్రీన్‌మీద వీడియో రూపంలో మైనర్ పిల్లలకు మోటార్‌సైకిళ్లు ఇవ్వకూడదని, ఇస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించిన అనంతరం ట్రాఫిక్ సీఐ జావేద్ మాట్లాడుతూ మైనర్లు మోటార్ సైకిళ్లను నడిపితే ఆ బాధ్యత వారి తల్లిదండ్రులదేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనం కోసం యూత్ (జె.కె.యూత్) వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా, విద్యార్థి నాయకుడు సుబ్బరాయుడు, ఆప్‌కి ఆవాస్ జిల్లా కార్యదర్శి షేక్ చాంద్‌బాషా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో దేవుని కడప ఆలయం





రథానికి రంగుల కళ

ప్రత్యేక ఆకర్షణగా దేవతామూర్తుల కటౌట్






విద్యుద్దీపకాంతుల్లో ప్రత్యేక సెట్టింగ్..

సర్వాంగ సుందరం

కడప రాయుడి కోవెల సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో దేవుని కడప దేవాలయం విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా వెలుగొందుతోంది. మంగళవారం నుంచి దేవుడి కడప బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు.

– ఫొటోలు: రఫీ , సాక్షి ఫొటోగ్రాఫర్



విద్యుద్దీపకాంతుల్లో ఏనుగు బొమ్మ

ఘన సన్మానం



పుత్తా పుల్లారెడ్డిని సత్కరిస్తున్న సాహితీవేత్తలు

కడప కల్చరల్ : విశ్రాంత ఇంజనీరు పుత్తా పుల్లారెడ్డికి గల పురాణ పరిజ్ఞానం అమోఘమని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కొనియాడారు. ఇటీవల ఆయనకు కడప రెడ్డి సేవా సమితి సాహిత్య రత్నాకర బిరుదును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఐఎంఏ హాలులో ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు , విద్యావేత్త అలపర్తి పిచ్చయ్య చౌదరి , డాక్టర్ పుత్తా బాలిరెడ్డి , డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, డాక్టర్ పి.నాగరాజు, స్వరూపరాణి, డాక్టర్ జీవీ సాయి ప్రసాద్, డాక్టర్ ఎ.చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ వి.వెంకటేశ్వరాచారి, డాక్టర్ పి.నీలవేణి, డాక్టర్ పాలెం వేణుగోపాల్, డాక్టర్ కె.స్వతంత్ర బాబు, కె.బాల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కడప కార్పొరేషన్: ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్. మనోజ్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 22 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం అర్జీలు-7, టౌన్ ప్లానింగ్-7, రెవెన్యూ విభాగం-6, హెల్త్ విభాగం-1, యూపీఏ విభాగం- 1 అర్జీలు వచ్చాయి. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి న్యాయ పద్ధతిలో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే రాకేష్ చంద్ర, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ధనలక్ష్మి, నారాయణస్వామి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, సిటీ ప్లానర్ రమణ పాల్గొన్నారు.

విశ్వేశ్వరునికి సువర్ణ కవచం



సువర్ణ కవచంలో శ్రీ కాశీ విశ్వనాథస్వామి, పార్వతీమాత

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో గల కాశీవిశ్వేశ్వరునికి భక్తులు సువర్ణ కవచం చేయించారు. రూ. 5.50 లక్షలు విలువజేసే 70 గ్రాముల బంగారంతో ఈ కవచాన్ని చేయించి ఇచ్చినట్లు అర్చక వర్గాల సమాచారం. దాతలు తమ పేరును బయటికి వెల్లడించేందుకు ఇష్టపడలేదు. అర్చకులు సోమవారం ఆ కవచాన్ని మూల మూర్తులైన శ్రీ విశ్వేశ్వరుడు, పార్వతీమాతలకు అలంకరించడంతోపాటు ప్రత్యేకంగా పూలతో కనుల పండువగా విశేష అలంకారం చేశారు. భక్తులకు దర్శనాలకు అనుమతించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న టీచర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి డీఈఓ షంషుద్దీన్‌ను కోరారు. జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన షంషుద్దీన్‌కు సోమవారం శ్యాంసుందర్ రెడ్డి ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి డైరీ, జీఓల పుస్తకాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, జిల్లాకౌన్సిలర్లు రామసుధాకర్ రెడ్డి, మొహిద్దీన్ ఖాన్, రామచంద్రారెడ్డి, మస్తాన్ బాబు, నరసింహులు, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

– జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కడప నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న పార్టీ ముఖ్య నేతలు రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్ బాబు, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కడప నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమితులైన వారికి మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డితోపాటు, మేయర్ సురేష్ బాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 40 శాతానికిపైగా ఓట్లను సాధించిందని, అతి తక్కువ ఓట్లతో ఓటమి పాలైందన్నారు. 40 శాతం ఓట్లు సాధించడమంటే సామాన్యమైన విషయం కాదని, ప్రజల్లో ఎంతో అభిమానం ఉంటే తప్పా ఇన్ని ఓట్లు సాధించడం సాధ్యం కాదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కొంచెం కష్టపడితే రాబోయే అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని తెలిపారు. ఈ పదవులను అలంకార ప్రాయంగా కాకుండా బాధ్యతతో నిర్వర్తించాలని సూచిస్తూ, పదవులు పొందిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పాకా సురేష్, బంగారు నాగయ్య, దేవిరెడ్డి ఆదిత్య, కరిముల్లా, దాసరి శివ పాల్గొన్నారు.

ఓపెన్ డ్రైన్లను పరిశుభ్రంగా ఉంచాలి

– కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ఓపెన్ డ్రైన్లను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన బీడీ కాలనీ, గంజికుంట కాలనీ, కేఎంసీ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. బీడీ నగర్, ఆర్‌కేఎనగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి ప్రవాహం సజావుగా సాగేందుకు లెవెల్స్‌కు సరిచూడాలన్నారు. చెత్తాచెదారాలను తొలగించి ఓపెన్ డ్రైన్లను శుభ్రంగా ఉంచాలని, గంజికుంట కాలనీవద్దనున్న కేసీ కాలువలో పూడిక, వ్యర్థాలను తొలగించాలన్నారు. మసీదు, పాఠశాల వద్ద రహదారులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్న క్యాంటీన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చేతులు కడిగే ప్రాంతం, పాత్రలు కడిగే ప్రాంతాలలో నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.



గంజికుంట కాలనీలో ఓపెన్ డ్రైన్లను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

ఉత్సాహంగా పోటీలు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో సోమవారం ఖేలోఇండియా 'అస్మిత' ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఖేలోఇండియా, ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సహకారంతో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-15 ఫుట్‌బాల్ లీగ్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి, ఏపీ ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. డానియల్ ప్రదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ క్రీడాకారిణుల్లో ప్రతిభను వెలికితీసేలా నిర్వహిస్తున్న ఈ క్రీడాపోటీల్లో విజేతలకు భారీ నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. కడప నగరంలో తొలి ఖేలోఇండియా అస్మితా ఫుట్‌బాల్ లీగ్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మంగళ, బుధవారం సైతం ఈ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమబహుమతి రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేలు అందజేయనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో ఖేలోఇండియా న్యూట్రిషనిస్టు సుజేతశెట్టి, ఫిజియోథెరపిస్టు సునీత, ఫుట్‌బాల్ కోచ్ హరి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అధికారులు, నిర్వాహకులు

కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : బంగారు భవిష్యత్తుగల విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర పిలుపులో భాగంగా ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో కడప కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఇటీవల భవనం పైకి ఎక్కి దూకి మృతి చెందాడన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేయడం పై ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలు కాపాడడంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరపోగు రవి, కంసల శివశంకర్, రాజశేఖర్ రెడ్డి, అభినయ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యార్థులకు అభినందన

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురం అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాల హెచ్ఎం ఎబినేజర్ అభినందించారు. రిపబ్లిక్ డే సెలబ్రేషన్‌లో దేశభక్తి గీతాల పోటీలో అంధుల పాఠశాల విద్యార్థులకు జిల్లా ప్రథమ బహుమతి వచ్చింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అంధుల పాఠశాల విద్యార్థులు ఆలపించిన గానానికి కలెక్టర్, జేసీలు జ్ఞాపిక, ప్రశంసపత్రం అందచేసి అభినందించారు. అలాగే తెలుగు విజన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీ బ్రెయిలీ రాయడంలో 110 మంది విద్యా ర్థులు పాల్గొనగా అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అంధుల పాఠశాల విద్యార్థులు సాధించారు. ఇందుకుగాను హెచ్ఎం ఎబినేజర్‌తోపాటు పేరెంట్ కమిటి చైర్మెన్ సురభి, కృష్ణవేణి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రాజు, శ్రీను, రమణ అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

శుభాకాంక్షలు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా నూతన విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు(ఆపస్) కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, పరిరక్షణకు కృషి చేయాలని డీఈఓను వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డీఈఓ షంషుద్దీన్ మాట్లాడుతూ మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపే దానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రెడ్డయ్య రెడ్డి, గంగన్న, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు పూలగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న ఆపస్ నాయకులు

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్: కడప నగరంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)పై ఆరా తీశారు. వీడియో వాల్ పరిశీలించారు. నగరంలోని సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోడ్ల మరమ్మతుల నేపథ్యంలో పనిచేయని చోట్ల సీసీ కెమెరాలు తిరిగి పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. కడప నగరంలో ట్రాఫిక్ గురించి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావేద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట కడప డిఎస్పీ వెంకటేశ్వర్లు, కడప వన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ, కమాండ్ అండ్ కంట్రోల్ ఎస్ఐ జీవన్‌రెడ్డి, ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి వున్నారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: బీజేపీ ప్రభుత్వం వేతన జీవులకు చేసిన మేలు చెప్పుకోదగ్గ స్థాయిలో లేదని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ)రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్దన రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్ మోహన్ రెడ్డి, ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పన్నుల పెంపు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం వలన సగటు ఉద్యోగి బతకడమే కష్టతరమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌లో వేతన జీవులకు కనీసం పదిలక్షల రూపాయల వరకు పన్ను లేకుండా చేయాలన్నారు. అలాగే రూ.15 లక్షల వరకు 5 శాతం పన్ను, రూ.15 లక్షల నుండి రూ.20 లక్షల వరకు 10 శాతం పన్ను, రూ. 20 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు 15 శాతం పన్ను విధించేలా నూతన పన్ను విధానం ఉండాలని కోరారు.

దినేష్ ఆసుపత్రిలో ఆధునిక ఎండోస్కోపీ సూట్ ప్రారంభం



డాక్టర్ దినేష్ రెడ్డి

కడప రూరల్ : కడప నగరంలోని డాక్టర్ దినేష్ గ్యాస్ట్రో, లివర్, ఎండోస్కోపీ సెంటర్‌లో సోమవారం ఆధునిక ఎండోస్కోపీ సూట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన ఈ రెండవ ఎండోస్కోపిక్ మిషన్ ద్వారా బ్లూ లేజర్ కాంతి శక్తితో, జీర్ణ వ్యవస్థలో వచ్చే క్యాన్సర్ కణాలను అల్సర్లను అత్యంత ముందుగా ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని తెలిపారు. వ్యాధిని గుర్తించడం ద్వారా అందుకు తగిన చికిత్సను వెంటనే ప్రారంభించి వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. ఈ మిషన్ ద్వారా అతి చిన్న తేడాలను కూడా గుర్తించగలమని.. ప్రజలు ఈ అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసు కోవాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కడప ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎ.పి.యస్.ఆర్.టి.సి. అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన జీతాలు ప్రకారం కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని.. ఆ సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్, జిల్లా కార్యదర్శి స్టీఫెన్ ఆంటోనీ, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, మహిళా విభాగం జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

